

షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు: జేసీ

పార్వతీపురం రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం డివిజన్ పరిధిలో షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలని జేసీ శోభిక ఆదేశించారు. శనివారం పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఎనిమిది మండలాల అధికారులతో సమీక్షించారు. నిర్ణయించిన తేదీల్లో పక్కాగా గ్రామసభలను నిర్వహించాలన్నారు. గ్రామాల్లో రీసర్వేపై ముందుగా రైతులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామసభల్లో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. ఈ సమీక్షలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

- మక్కువలో మద్యం షాపునకు భారీ మొత్తంలో చెల్లింపు
- ఇతర చోట్లా ఇదే తంతు.. జోరుగా బేరసారాలు
- ఎంతైనా ఇచ్చి దుకాణాలు దక్కించుకునేందుకు యత్నం
- లాభం ఆధారపడేది మాత్రం బెల్ట్ దుకాణాలపైనే..
- ఇప్పటికే ఆ దిశగా ప్రారంభమైన విక్రయాలు

ఒక షాపు.. గుడ్‌విల్ రూ.కోటి





పార్వతీపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపుల గుడ్‌విల్ రూ.కోట్లకు చేరింది. లాటరీలో దుకాణం పొందలేని వారు.. తమ ప్రాంతాల్లో షాపులను దక్కించుకున్న వ్యాపారులకు భారీగా ఆఫర్ చేస్తున్నారు.

ఎంతైనా ఇచ్చి.. షాపులకు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా మక్కువ మండలంలో ఓ మద్యం షాపునకు భారీ మొత్తంలో గుడ్‌విల్ కింద చెల్లించడం చర్చనీయాంశమవుతోంది. పార్వతీపురానికి చెందిన ఓ సిండికేట్ వ్యాపారికి మక్కువ మండలంలో మద్యం షాపు దక్కింది. ఈ దుకాణాన్ని సుమారు రూ.కోటిపైనే మక్కువకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తికి విక్రయించారు. జిల్లాలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా గుడ్‌విల్ పేరిట సిండికేట్లు వ్యక్తిగత మద్యం షాపుల వ్యాపారులతో బేరసారాలు చేస్తున్నారు. మొత్తంగా రూ.60 లక్షల నుంచి రూ.కోటిపైన ఇచ్చేందుకు వెనుకాడడం లేదు.

ఇదీ పరిస్థితి..

నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని 52 మద్యం షాపులకు లాటరీ నిర్వహించారు. టీడీపీ, వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ఒక్కటై అత్యధికంగా షాపులు దక్కించుకున్నారు. వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్న కొంతమందికి అదృష్టవశాత్తూ లాటరీలో మద్యం షాపు దక్కింది. అయితే ఇటువంటి వారిపై సిండికేట్ వ్యాపారుల కన్ను పడింది. ఆ షాపులు తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించి.. సఫలీకృతులవుతున్నారు. ఈ నేపథ్యంలో గుడ్‌విల్ కింద రూ.60 లక్షల నుంచి రూ.కోటిపైనే ఇస్తున్నట్లు సమాచారం. వ్యక్తిగతంగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు గాని, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు గాని జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో షాపులు నిర్వహించాలంటే రాజకీయ బలం ఎంతో అవసరమనే అభిప్రాయాన్ని స్థానిక సిండికేట్‌లు కల్పిస్తున్నారు. దీంతో తమకెందుకులే ఈ గొడవ అన్నట్టుగా భావించి.. కొంతమంది జిల్లా సిండికేట్ వ్యాపారులకే షాపులను విక్రయిస్తున్నారు.

- జిల్లాలో మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పాత మద్యాన్నే సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇది క్లియరెన్స్ అయిన తర్వాత కొత్త మద్యం బ్రాండ్స్ విక్రయాలు మొదలు కానున్నాయి. నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రస్తుతం ఎంసీ, ఐబీ విస్కీ అనే రెండు బ్రాండ్స్‌ను అదనంగా విక్రయిస్తున్నారు. కాగా గత వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజా ప్రతినిధుల అండతో కొందరు ఇష్టారాజ్యంగా బెల్టులు నిర్వహించేవారు. ప్రస్తుతం జిల్లాలో కొన్నిచోట్ల పాత బెల్ట్‌షాపుల నిర్వాహకులే రహస్యంగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. దీనిపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. బెల్టు దుకాణాలకు చెక్‌పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'బెల్టు' పై చూపు

- మద్యం దుకాణం ద్వారా రోజువారి సేల్స్ అధిక మొత్తంలో ఉంటేనే వ్యాపారులకు గిట్టుబాటు అవుతుంది. లేకుంటే నష్టాలను భరించాల్సి ఉంటుంది. అయితే ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు వ్యాపారులు అప్పుడే తమకు కావాల్సిన దారులు వెతుక్కుంటున్నారు. ఈ మేరకు బెల్టు షాపులను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మద్యం షాపులకు లైసెన్స్ ఫీజు కింద ఏడాదికి రూ.55 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు చెల్లించాలి. దుకాణం నిర్వహణ తదితర వాటి కోసం రోజుకు కనీసం రూ.20 నుంచి రూ.25 వేలు ఖర్చువుతుంది. రూ.లక్ష మద్యం విక్రయిస్తే మిగిలేది రూ.18 వేల నుంచి రూ.20 వేలేనని కొంతమంది మద్యం వర్తకులు చెబుతున్నారు. ఇదే సమయంలో మద్యం అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోతే నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని వారు వాపోతున్నారు. దీంతో కొంతమంది అప్పుడే అడ్డదారులను వెతుక్కుంటున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాప్‌ల ద్వారా ఎక్కువ అమ్మకాలు జరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- ఏ విధంగా అయినా మద్యం దుకాణాల ద్వారా భారీ ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యంతో మద్యం వ్యాపారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని మద్యం దుకాణాల్లో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. భవిష్యత్తులో వాటి ధరలు ఇంకెంత పెంచుతారోనన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మొత్తంగా కొంతమంది మద్యం వ్యాపారులు ఎక్సైజ్ నిబంధనలు పాటించేలా కనిపించడం లేదు. మద్యం విక్రయాలతో ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకముందే ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది. నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంది.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జిల్లాలో 52 మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడా అధిక రేట్లకు మద్యం అమ్మడం లేదు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు.

-జీవన్ కిషోర్, ఏఈఎస్,
పార్వతీపురం మన్యం

ఆ 4 గంటలు నరకం

అంతర్రాష్ట్ర రోడ్డుపై గోతిలో దిగబడిన లారీలు



గుమడ వద్ద అంతర్రాష్ట్ర రహదారి గోతిలో దిగబడిన లారీ

కొమరాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతుల్లో రెండు లారీలు దిగబడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు గంటల పాటు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో కొమరాడ మండలం గుమడ వద్ద ఒడిశా వైపు నీలగిరి కర్రల లోడ్‌తో వెళ్తున్న లారీ, కూనేరు వద్ద ఒడిశా నుంచి పార్వతీపురం వైపు వస్తున్న గూడ్స్ లారీ గోతుల్లో కూరుకుపోయాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నాలుగు గంటల పాటు వాహనదారులకు నిరీక్షణ తప్పలేదు. చివరకు లారీ కార్మికులు ఎక్స్‌కవేటర్ సాయంతో గోతుల్లో పడిన లారీలను పక్కకు తప్పించారు. ఆ తర్వాత యథావిధిగా వాహన రాకపోకలు సాగాయి. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చు కున్నారు.



కూనేరు వద్ద మరో లారీ ఇలా..

న్యూస్ బాక్స్

పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నారాయణ

భామిని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగులకు పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నారాయణ ఆదేశించారు. శనివారం భామిని, బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఓపీ, రికార్డుల్లో రోగుల ఆరోగ్య సమస్యలు, జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చేవారికి నిర్వహిస్తున్న పరీక్షలు, చికిత్స వివరాలపై ఆరా తీశారు. రోగ నిర్ధారణ పరీక్షలు, సాధారణ కాన్పులపై సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం ల్యాబ్ రికార్డులు, మందులు నిల్వలను తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు. ఆ తర్వాత భామిని కేజీబీవీని సందర్శిం చారు. ఆయన వెంట వైద్యాధికారులు దామోదర్, సంతోషిలక్ష్మి, సూపర్‌వైజర్లు తదితరులున్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

సీతంపేట రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీతంపేటకు చెందిన విద్యార్థిని సవర లావణ్య మృతిపై ఐటీడీఏ పీవో చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరిలకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతే కాకుండా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఘటనపై టెక్కలి ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించినట్లు సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం ఓ ప్రకటలో తెలిపారు.

పాఠశాలల నిర్వహణకు నిధులు


- రూ.వంద కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వెల్లడి

సాలూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం ప్రకటించారు. దీనిపై జిల్లా ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించలేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు తమ సొంత సొమ్మును వినియోగించేవారు 2021-2022లో పూర్తిగా నిర్వహణ నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం.. 2022-2023లో 20 శాతమే మంజూరు చేసింది. ఈ నిధులు సైతం అన్ని పాఠశాలలకు ఇవ్వలేదు. 2023-2024లోనూ రిక్తహస్తం చూపింది. దీంతో సుద్దముక్క నుంచి వివిధ మరమ్మతులు, జాతీయ పండగలు, ప్రభుత్వ కార్యక్రమాలు ఎంఈవోలు కోరిన సమాచారం, జిరాక్స్‌లు, తల్లిదండ్రులు, విద్యాకమిటీ సమావేశాల నిర్వహణ ఖర్చులను ప్రధానోపాధ్యాయులు భరించాల్సి వచ్చేది. మండలాల్లో ఎమార్సీలు (ప్రస్తుతం ఎంఈవో కార్యాలయాలు) నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఎంఈవోలు సైతం చేతి చమురు వదిలించుకున్నారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 15 ఎంఈవో కార్యాలయాలు, 1293 ప్రాథమిక, 102 ప్రాథమికోన్నత, 187 ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిల్లో 94 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వాటి నిర్వహణకు త్వరలో కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి పీఎంశ్రీ పాఠశాలలకు రూ. 8.63 కోట్లు, కేజీబీవీలకు రూ. 35.16 కోట్లు, ఎంఈవో కార్యాలయాలు (ఎమ్మార్సీ)లు నిర్వహణకు రూ. 8.82 కోట్లు, పాఠశాలలకు రూ. 51.90 కోట్లు అందించనున్నారు. ఈ నిధులు సైతం రెండు రోజుల్లో జమకానుండడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అప్పుడు 20 ఇప్పుడు 16

వెంపలగూడ-పాతరేగులగూడ రహదారి ఇలా..



- సీతంపేట ఐటీడీఏ పరిధిలో రోడ్ల నిర్మాణాలపై ఫిర్యాదులు
- రూ.54.88 కోట్ల పనులపై ఆరోపణలు
- విజిలెన్స్ విచారణ ప్రారంభం
- గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అధికారుల్లో అలజడి

సీతంపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో చేపట్టిన రహదారి నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 20 రోడ్ల పనులకు సంబంధించి విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందులో రూ.33.1 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా మరో 16 రోడ్ల పనులకు సంబంధించి రూ.21.87 కోట్లు దుర్వినియోగమైనట్లు శ్రీకాకుళం విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు వెళ్లాయి. మొత్తంగా 36 రహదారులకు గాను రూ.54.88 కోట్లు అక్రమాలు జరిగినట్లు తెలిసింది. వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు సంబంధిత అధికారులు రంగంలోకి దిగడంతో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ సిబ్బందిలో అలజడి మొదలైంది.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని సీతంపేట, పాతపట్నం, హిరమండలం, మందస, మెళియాపుట్టి, పలాస మండలాల్లో మారుమూల గిరిజన గ్రామాల్లో 2019-2023 వరకు రహదారి పనులు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో రోడ్లను నిర్మించారు. కాగా సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఆయా రహదారుల పనుల్లో అక్రమాలు జరిగినట్లు పలువురు విడతల వారీగా శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ రోడ్లకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని విజిలెన్స్ అధికారులు సీతంపేట గిరిజన సంక్షేమ శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే 20 రహదారులకు సంబంధించి కొంతవరకు సమాచారం ఇవ్వడంతో విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. తాజాగా మరో 16 రోడ్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సీతంపేట ఏజెన్సీలో రహదారి పనులను పరిశీలించారు. 'గతంలో నిర్మించిన 20 రహదారులతో పాటు మిగిలిన మరో 16 రోడ్ల పనులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని విజిలెన్స్ విభాగం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు పూర్తి సమాచారాన్ని ఇస్తున్నాం. విజిలెన్స్ అధికారుల విచారణ కూడా మొదలైంది.' అని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ ఎస్.సింహాచలం తెలిపారు.

విచారణ చేపట్టాల్సినవి ఇవే..

అంచనా వ్యయం	రెండో విడత ఫిర్యాదుల్లో పేర్కొన్న రోడ్లు
రూ.80 లక్షలు	కోడిశ-జోగ్గినాయుడుగూడ
రూ.96 లక్షలు	నేలబొంతు-భీంపురం-చందనగిరి
రూ.42 లక్షలు	పరశురాంపురం-చందనగిరి(కేరాసింగి గూడ)
రూ.1.11 లక్షలు	పరశురాంపురం-కేరాసింగిగూడ (బిట్-2)
రూ.190 లక్షలు	పుట్టిగాం-నరడాం వయా బంగారుగూడ
రూ.50 లక్షలు	గొయ్యిగూడ-జోడుమానుగూడ
రూ.180 లక్షలు	నారాయణగూడ-గదబవలస
రూ.2 కోట్లు	బొమ్మిక రిజర్వాయర్ - నారాయణగూడ
రూ.33 లక్షలు	వెంపలగూడ - పాతరేగులగూడ
రూ.2 కోట్లు	వాసుదేవ గుడి రోడ్డు- ఓల్డ్ ఎమ్మార్వో ఆఫీస్ వరకు
రూ.2 కోట్లు	హైస్కూల్- ఉమాగిరి గ్రామం
రూ.2 కోట్లు	ఓల్డ్ ఎమ్మార్వో ఆఫీస్-హైస్కూల్ వరకు..
రూ.90 లక్షలు	ఆర్అండ్‌బీ రోడ్డు -ఈతమానుగూడ
రూ.1.85 లక్షలు	చీపి-బుడంబో బీటి రోడ్డు- భావనపురం
రూ.1.80 లక్షలు	కొండలోగాం- తబ్బగాం వయా దాలకాయి
రూ.1.50 లక్షలు	ఓల్డ్ ఎన్‌హెచ్-5-బిన్నల వయా బి.మదనాపురం

రౌండ్‌టేబుల్ సమావేశానికి
బొబ్బిలి రాజా
- గాంధీజీతో కలసి హాజరైన వైనం
6

వైవిధ్యం.. ఆదివాసీ జీవనం
- వింత ఆచారాలు వారి సొంతం
- మూలికా వైద్యమే రక్ష
6



గుల్లబారుతున్న ఎముకలు
- వృద్ధులు, మహిళల్లో పెరుగుతున్న సమస్యలు
- అవగాహనతోనే నివారణ
- నేడు వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే
6






ఆగం పండగ నిర్వహిస్తున్న ఆదివాసీలు

వైవిధ్యం.. ఆదివాసీ జీవనం!

● వింత ఆచారాలు వారి సొంతం ● మూలికా వైద్యమే రక్ష

సీతంపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి)

ఆదివాసీల జీవనం వైవిధ్య భరితం. వారి జీవన శైలి విభిన్నం. కొండ కోనల్లో నివసిస్తూ... బాహ్య ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆదిమ గిరిజనులు. వేకువజామునే లేచి బతుకువేటలో ముందుకు సాగుతుంటారు. చద్దన్నం మూట కట్టుకొని పోడు వ్యవసాయ పనులకు వెళ్లడం వీరి దినచర్యలో భాగం. పోడు వ్యవసాయం చేసుకుంటూ అటవీ ఉత్పత్తులు సేకరించుకొని... వచ్చే డబ్బుతో సంతల్లో వారానికి సరిపడా నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకొని జీవనం సాగిస్తుంటారు. ఆదివాసీల్లో కులాలు ఎన్ని ఉన్నా ప్రాంతాలను బట్టి వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు మారుతుంటాయి. సీతంపేట ఏజెన్సీలో సవర, జాతాపు కులాలకు చెందిన గిరిజనులు ఎక్కువగా జీవిస్తున్నారు.

పాత పద్ధతులతోనే వ్యవసాయం..

ఈ ఆధునిక యుగంలో కూడా ఆదివాసీలు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు. నాగలి, పూదు, పార, గునపం, జిగ్గి కత్తి, కోండి, గొడ్డలి, కొడవలి, బాడిత, కొంటి కర్ర, కంక, బొరిగ వంటి వాటిని పనిముట్లను ఉపయోగించి వ్యవసాయం చేస్తారు. గిరి శిఖర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు పాత పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తూ.. పెట్టుబడి తక్కువగా పెట్టి లాభాన్ని ఎక్కువగా ఆర్జిస్తున్నారు.

వింత పండగలు

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేది వారి పండగలు.



ఏడాది పొడవునా ఏదో ఒక పండగ వస్తూనే ఉంటుంది. ఆగమ పండుగ, పులిపండుగ, విత్తన పండగ, కంది కొత్తల పండగ, అమ్మోరమ్మ పండగ, జన్మరాజు పండగ, కొండ దేవత పండగ, టెంక పండగ, బాలే కొత్త పండగ తదితర పండగలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.

ఆకు కూరలతో ఆరోగ్యం..

ఆదివాసీలు ఎక్కువగా అటవీ ప్రాంతంలో నివసిస్తుంటారు. వీరు కూరగాయలను ఎంతో ప్రియంగా పండిస్తారు. వీటినే ఎక్కువగా తినేందుకు ఇష్టపడతారు. వీరి ఆరోగ్యాన్ని కాపాడడంలో కూరగాయలు ప్రధాన భూమిక పోషిస్తాయి. గోంగూర, బోదంటం కూర, గుడం కూర, అడవి దొండకాయలు, అంగాకర కాయలు, చేదుకూర, మునగకూరలతో పాటు దుంప జాతికి చెందిన కంద దుంపలు, గోని దుంపలు, అరిక దుంపలు, చేదు దుంపలు, కర్ర పెండలం, చార దుంపలు వంటివి కూడా పండిస్తారు.

ఇంటిలో వాడే వస్తువులివీ...

ప్రస్తుతం కొన్ని రకాల మార్పులు చోటు చేసుకున్నప్పటికీ... ఎక్కువ మంది




గిరిజనులు పండించే పంటలు

ముఖ్య పంటలు..

ఆదిమ గిరిజనులు పండించే పంటలు నేటి మానవాళికి నిత్య అవసరంగా మారాయి. ఒకప్పుడు వీరు పండించే పంటలకు అంత గిట్టుబాటు ధర లభించేది కాదు. నేటి నాగరిక యుగంలో కాలానుగుణంగా పెరిగిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ఆ పంటలకే గిరాకీ ఎక్కువైంది. వీరు ప్రధానంగా పండించే పంటల్లో గంటెలు, సామలు, నువ్వులు, ఒలుసులు, జుడుములు, రాగులు, ఉలవలు, కొర్రలు, బొబ్బర్లు అధికంగా ఉంటాయి. పోడు, మెట్టు భూముల్లో వీటిని ఎక్కువగా పండిస్తారు. గిరిజనులు పంటలకు మంచి గిరాకీ ఉండడంతో వీటి ద్వారా వారి ఆర్థిక స్థితిని మెరుగు పరుచుకుంటున్నారు. అలాగే మన్యం ప్రాంతంలో సీజనల్ పంటలైన పైనాపిల్, పనస, సీతాఫలం, అరటి, రాంఫలం వంటి పంటలు వీరికి ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్నాయి.

తమ సంప్రదాయ జీవనానికి పూర్తిగా దూరం మాత్రం కాలేదు. ఆదివాసీ సంప్రదాయ జీవనం ప్రకారం గిరిజనులు నివసించే ఇళ్లు తమ ఉత్పత్తులు నిల్వ ఉంచుకోనేలా తీర్చిదిద్దుతారు. వారు ఇంటిలో ఉపయోగించే వస్తు సామగ్రి ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆనప తుంబలు, డోకి, గిడుగు, వినన కర్ర, రోకలి, మట్టి కుండ, తిరగలి, కుంచం, అడ్డ, కర్ర తెడ్డు, కొబ్బరిగరిటె, పండ్ల గంప, తట్ట, చేటలను ఇంటి అవసరాల నిమిత్తం వినియోగిస్తారు.

ఆడుతు పాడుతూ..

ఆదివాసీలు ఏడాది పొడవునా ఏదో ఒక పండగ చేసుకొని ఆడుతూపా డుతూ జీవనం సాగిస్తారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే లా వేషధారణ ధరించి వారి బాషలో ఉండే పాటలకు నృత్యాలు చేస్తారు. ఆడ, మగ అనే తేడా లేకుండా మద్యాన్ని పూటుగా తాగుతారు. గ్రామంలో ఎవరి శుభకార్యమైనా పెద్ద, చిన్న అనే తేడా లేకుండా ఆనందంగా పాల్గొంటా రు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న పండగల్లో ఉత్సాహంగా పాల్గొని నృత్యా లు చేస్తూ వారి ఇష్ట దైవాలను ప్రార్థిస్తారు. ఆదివాసీలు చేసే నృత్యాలలో ప్రధానమైనది ధింసా. ఈ నృత్యానికి నేటికీ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇలా వారి ప్రత్యేకమైన జీవనశైలి కోసం ఎంత చెప్పుకున్నా తక్కువనే చెప్పాలి.



మూలికా వైద్యం..

గిరి శిఖర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు నేటికీ మూలిక వైద్యంపై ఆధారపడి జీవిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో వందల ఏళ్లుగా కాలపరీక్షకు నిలబడి, తన ఉనికిని చాటుకుంటూ... కొన్ని రకాల వ్యాధుల నివారణ విషయంలో ఈ మూలికా వైద్య విధానం ప్రఖ్యాతి గాంచిందనే చెప్పాలి. దీనికి మిగిలిన సమాజంలో అంతగా ఆదరణ లేని మాట నిజం. మూలికా వైద్యంతో ప్రత్యేకించి కొన్ని రకాల వ్యాధులను నయం చేస్తుంటారు. మూలికా వైద్యంతో పచ్చకామెర్లు, అతిసారం, చర్మవ్యాధులు, మధుమేహం, స్త్రీల వ్యాధులు, విష జ్వరం, విరిగిన అవయవాలకు కట్టు కట్టడం, మేహ ఉడుకు, విరేచనాలు, మూల శంక, మొలలు, మూర్ఛ, మలబద్ధకం, దగ్గు, మానని కురుపులు వంటి వాటికి గిరిజనులు ఎక్కువగా వైద్యం చేస్తుంటారు. మూలికా వైద్యంలో వీరు ఎక్కువగా అరటి మొక్కలు, జమ్మరాజు మొక్క, పాతాళ గిరిడ, నేరేడుతో పాటు పాముకాటుకు నాగస్వరం వంటి మూలికలను ఉపయోగించి రోగులకు వైద్యం అందిస్తారు.

విత్తనాలు ఎలా భద్రపరుస్తారంటే...

కందులతో పొయ్యి బుగ్గి, ములగ చెక్క, నల్లజీడి పిక్కలు కలిపి గంపలో పెట్టి.. వాటి పై వరిగడ్డి కప్పి మన్ను, పేడ కలిపిన ఇసుకతోపై నుంచి కప్పేసి ఉంచుతారు. వీటిని మళ్లీ ఏడాది తరువాత విత్తనంగా ఉపయోగిస్తారు.

గుల్లబారుతున్న ఎముకలు

● వృద్ధులు, మహిళల్లో పెరుగుతున్న సమస్యలు

● అవగాహనతోనే నివారణ

● నేడు వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే

● జిల్లా కేంద్రానికి చెందిన రామారావుకు 60 ఏళ్లు. ఇటీవల అతను బాత్‌రూమ్‌కు వెళ్లేటప్పుడు హఠాత్తుగా కింద పడడంతో తుంటి ఎముక విరిగింది. దీంతో ఆయన్ను కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆస్టియోపోరోసిస్‌తో ఎముక గుల్లబారి విరిగినట్టు వైద్య పరీక్షలో తేల్చారు. ఇలాంటి సమస్య ఒక్క రామారావుకే కాదు... జిల్లాలో 5 వేల నుంచి 10 వేల మందికి ఉంది. వృద్ధులతో పాటు మోనోపాజ్ తరువాత మహిళలను ఇబ్బందులు పెట్టే సమస్యల్లో ఆస్టియోపోరోసిస్ ఒకటి. దీన్ని దీని వల్ల ఎముకల సాంద్రత తగ్గి, పటుత్వం కోల్పోయి గుల్లబారుతాయి. ఈ ప్రక్రియ నెమ్మదిగా జరగడంతో చాలా మందిలో ఎముకలు విరిగేంత వరకూ ఎలాంటి లక్షణాలు కనబడవు.



విజయనగరం, రింగురోడ్డు/బొబ్బిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డబ్ల్యూహెచ్‌వో సర్వే ప్రకారం 50 ఏళ్లు పైబడినవారిలో ఆస్టియోపోరోసిస్ లక్షణాలు కనిపిస్తున్నట్లు తేలింది. దేశంలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు, ప్రతి ఎనిమిదిమంది మగవారిలో ఒకరు ఆస్ట్రియోపోరోసిస్‌తో బాధపడుతున్నట్టు సర్వే ద్వారా తెలిసింది. జీవనశైలిలో మార్పులు, మంచి పోషకాహారం తీసుకోవడం, సరైన వ్యాయామం చేయడం ద్వారా ఆస్ట్రియోపోరోసిస్ బారిన పడకుండా ఉంటారు.

ఎందుకు వస్తుంది?

సాధారణంగా ఎముక ఎదుగుదల్లో భాగంగా పాత కణాలు పోయి, కొత్త కణాలు చేరుతాయి. దీనినే ఎముక రీ మోడలింగ్ అంటారు. ఈ ప్రక్రియ చిన్నతనంలో మొదలై, కౌమారదశ వరకూ అతి వేగంగా ఉంటుంది. సుమారు 30 ఏళ్లకు పూర్తిస్థాయికి చేరుతుంది. ఈ దశలో కొత్తకణాలు ఎక్కువగా ఉండడంతో ఎముక దృఢంగా ఉంటుంది. ఆ తరువాత క్రమేణా కొత్త కణాలు చేరడం తగ్గుతుంది. 50 ఏళ్లు వచ్చేసరికి ఎముక సాంద్రత తగ్గి గుల్లబారుతుంది.

● ఆస్టియోపోరోసిస్ అనేది ప్రైమరీ, సెకండరీ రకాలుగా ఉంటుంది. మోనోపాజ్ తరువాత 65 ఏళ్లు పైబడిన వారిలో ఎముక సాంద్రత క్రమంగా తగ్గుతుంది. దీనివల్ల వచ్చే ఆస్టియోపోరోసిస్‌ను ప్రైమరీ అంటారు. ● ఎముక రీ మోడలింగ్ ప్రక్రియను నిరోధించే కారకాలతో 50 ఏళ్లలోపే ఆస్టియోపోరోసిస్ వస్తే దానిని సెకండరీ అంటారు. లివర్ సమస్యలు, జీర్ణకోశ వ్యాధులు, రుమటాయిడ్ వ్యాధులు, థైరాయిడ్, డయాబెటిస్ వంటి కారణాలతో సెకండరీ ఆస్టియోపోరోసిస్ వచ్చే అవకాశం ఉంది. ఇవే కాకుండా స్టెరాయిడ్స్ వాడకం, అధికంగా మత్తు పదార్థాలు సేవించడం, పొగతాగడం, కాలుష్యం, విటమిన్-డి లోపంతో కూడా ఆస్టియోపోరోసిస్ వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలు ఇవే..

ఆస్టియోపోరోసిస్‌ను సైలెంట్ డీసీజ్ అని కూడా అంటారు. చాలా మందికి ఎముకలు విరిగేంత వరకూ ఎలాంటి లక్షణాలు కనబడవు. నెమ్మదిగా నడుము వంగిపోవడం, వెన్నునొప్పి, అలసట లాంటి లక్షణాలు కొంత మందిలో కనిపిస్తాయి. వెన్నుపూస, తుంటి, ముంజేతి ఎముకలపై ప్రభావం చూపిస్తుంది.

నిర్ధారణ.. చికిత్స

ఎక్స్‌రే, సీటీస్కాన్‌లతో ఎముక ఫ్రాక్చర్‌ని వైద్యులు గుర్తిస్తారు. అలాగే బీఎండీ (బోన్ మినరల్ డెన్సిటీ) పరీక్ష, డెక్సా స్కాన్‌తో ఎముక సాంద్రతను పరీక్షిస్తారు. పరీక్ష ఫలితాలు తరువాత అనంతరం వైద్యులు తగిన చికిత్సను అందిస్తారు. అవసరమైన మందులు ఇస్తారు.



జాగ్రత్తలు తప్పనిసరి..



ఆస్ట్రియోపోరోసిస్ ఉన్నవారు శరీరాన్ని సాధ్యమైనంత వరకూ చురుగ్గా ఉంచుకోవాలి. ముఖ్యంగా నడక, వ్యాయామంతో ఎముకలు, కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, గింజలు, తృణధాన్యాలు, చేపలు, గుడ్లు లాంటి కాల్షియం అధికంగా ఉన్న ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలి. ముఖ్యంగా వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి. ముందే, వైద్య పరీక్షలు చేయించుకుని డాక్టరు సలహా ప్రకారం ఔషధాలు, చికిత్స తీసుకుంటే ఆస్టియోపోరోసిస్‌ను నివారించవచ్చును.

-డాక్టరు పవన్‌కుమార్, కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్, విజయనగరం.


జిల్లాలో 10 వేల మందిలో లక్షణాలు..



జిల్లా వ్యాప్తంగా సుమారు 5 నుంచి 10వేల మంది వరకు ఈ లక్షణాలతో బాధపడుతున్నారు. తగిన జాగ్రత్తలను పాటిస్తే కచ్చితంగా ఆస్టియోపోరోసిస్ నుంచి బయటపడవచ్చు. దీని బాధితులు చికిత్స నిమిత్తం బొబ్బిలి ప్రాంతం నుంచి వందల సంఖ్యలో వస్తున్నారు. వారందరికీ తగిన సూచనలు అందించి చికిత్స చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో వయో వృద్ధులకు ఈ సమస్య ఉంది. ఎముకలు విరిగినప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది. ఎక్స్ రే, సీటీ స్కాన్ వంటి పరీక్షల ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు. వెన్నుపూస, తుంటె ఎముక పరీక్షలు చేసినప్పుడు టి.స్కోరు 2.5 కన్నా తక్కువగా ఉంటే ఆస్టియోపోరోసిస్ ఉన్నట్లు నిర్ధారణ జరుగుతుంది. 65 ఏళ్లు దాటిన స్త్రీలు, 70 ఏళ్లు దాటిన పురుషులు బీఎండీ పరీక్షలు చేసుకోవడం అవసరం. శారీరక శ్రమ చాలా అవసరం. ఇందుకోసం ఏ పద్ధతినైనా పాటించవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత మందులను క్రమపద్ధతిలో వినియోగించుకోవాలి.

-డాక్టర్ రవిశంకర్, ఎముకల వైద్యుడు, బొబ్బిలి సీహెచ్‌సీ

93 ఏళ్ల క్రితం


లండన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో గాంధీజీతో బొబ్బిలి రాజా

రౌండ్‌టేబుల్ సమావేశానికి బొబ్బిలి రాజా

● గాంధీజీతో కలసి హాజరైన వైనం

బొబ్బిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):స్వాతంత్రోద్యమ కాలంలో మహాత్మాగాంధీతో కలిసి అడుగులు వేసిన అనేక మంది భారతీయుల్లో బొబ్బిలి సంస్థానాధీశులైన దివంగత రాజా ఆర్ఎస్ఆర్‌కే రంగారావు కూడా ఒకరు. 1931లో లండన్‌లో జరిగిన రెండో రౌండ్‌టేబుల్ సమావేశానికి గాంధీజీతో అనేక మంది జాతీయ నాయకులు కలిసి వెళ్లారు. భూ యజమానుల తరఫున పర్లాకిమిడి రాజా, బొబ్బిలి రాజాలు వెళ్లారు. సరోజినీనాయుడు, సర్వేపల్లి రాధాకృష్ణన్, వీవీ గిరి తదితరులు కూడా హాజరయ్యారు. రౌండ్ టేబుల్ సమావేశంలో నాటి ఇంగ్లండ్ ప్రధాన మంత్రి రామ్‌సే మెక్‌డొనాల్డ్ ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని ఇచ్చేందుకు ఆ సమావేశంలోనే కీలకమైన చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. దివంగత బొబ్బిలి రాజా ఆర్ఎస్ఆర్‌కే రంగారావు మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన తనయుడు ఆర్ వీజీకే రంగారావు ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ హయాంలలో పార్లమెంటు సభ్యునిగా వ్యవహరించారు. మనుమడు ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భూగర్భ గనుల శాఖామాత్యులుగా పనిచేశారు. మరో మనుమడైన (బేబీ నాయన) ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న సంగతి తెలిసిందే.





విజయనగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో శనివారం ఓవైపు ఎండ.. మరో వైపు... వానతో విచిత్ర వాతావరణం కనిపించింది. అంతవరకూ ఎండలు ఇబ్బంది పెట్టాయి. ఆ తరువాత చల్లటి చిరుగాలులు సేదదీర్చాయి. అప్పటి వరకూ ఆకాశం వెండి మబ్బులతో కనువిందు చేసింది. కొంతసేపటికి కారుమబ్బులతో వాన రాకకు సంకేతాలిచ్చింది. ఈ చిత్రాలను ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్ కెమెరాలలో బంధించి... మురిసి పోయారు. మరోవైపు ఎండావానా కలిసిన వాతావరణంలో కుర్రకారు బైకులపై జోరు చూపించారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

పార్టీ శ్రేణులకు టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈ నెల 26న ప్రారంభమవుతుందని.. దీనిని విజయవంతం చేయాలని సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం విజయనగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్ల పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందన్నారు. అందుకనే ప్రజలు ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారని.. కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. కూటమి నేతలు నిర్లిప్తత వహించకుండా నిత్యం ప్రజల మధ్యకు వెళుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా ప్రతి క్రియాశీలక సభ్యుడికి ప్రమాద బీమాను వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ఆల్తి బంగారుబాబు, కర్రోతు వెంకట నర్సింగరావు, అనురాధబేగంతో పాటు, టీడీపీ డివిజన్ ఇన్‌ఛార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశల వారీగా మౌలిక వసతులు

ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని విజయనగరం నియోజకవర్గ పరిధిలోని కోరుకొండ, కోరుకొండపాలెం, పినవేమలి గ్రామాల్లో శనివారం నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కిందఅన్ని గ్రామాల్లో ప్రాధాన్య క్రమంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. స్థానికులు చెప్పిన సమస్యలు, పర్యటన సందర్భంలో ప్రజల వినతుల మేరకు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు



ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ తెప్పోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు శరవేగంగా చేస్తున్నారు. ఏటా సిరిమానోత్సవం ముగిసిన అనంతరం వచ్చే మంగళవారం తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఈ నెల 22న తెప్పోత్సవం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలోని తీర ప్రాంతాల నుంచి మూడు బోట్లను తెప్పించారు. ఆదివారం ట్రయల్ రన్ వేయనున్నారు.

డయేరియా మృతులకు రూ.25 లక్షలు ఇవ్వండి



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

విజయనగరం దాసన్నపేట/కలెక్టరేట్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): గుర్ల గ్రామంలో డయేరియాతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. డీఆర్‌ఓకి వినతిపత్రం అందించారు.పరిహారంపై ముఖ్యమంత్రి వెంటనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు రమణమ్మ, జగన్మోహన్, రమణ, రాము, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలని..

బొబ్బిలి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్లలో దయారియాతో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కలుషిత నీటి కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే అధికార యంత్రాంగం చాలా చిన్న విషయంగా పరిగణించడం దారుణమన్నారు. మృతుల సంఖ్యపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ రాస్తారోకో వల్ల బొబ్బిలి-రామభద్రపురం రాష్ట్రీయ రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకరరావు, టీవీ రమణ, ఎస్.గోపాలం, సురేష్, బలస శ్రీనివాసరావు, ఐద్వా నాయకురాలు పుణ్యవతి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌పై విష ప్రచారం వద్దు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాజాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో ఎంతో మంది వృద్ధులు, కార్మికులు, పేద ప్రజానీకం సంతృప్తిగా భోజనం చేస్తూ... కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతుంటే ...దీన్ని ఓర్వలేని వైసీపీ నేతలు కొంతమంది వైసీపీ కార్యకర్తలతో విష ప్రచారం చెయ్యడం సిగ్గుచేటని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు, శాసపు రమేష్‌కుమార్, టంకాల కన్నంనాయుడు, ఎం.శ్రీనివాసరావు. గార గున్నంనాయుడు తదితరులు శనివారం తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం వీటిని మూసివేసి పేదల కడుపు కొట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే అన్న క్యాంటీన్ పునః ప్రారంభించడం ద్వారా చంద్రబాబు పేదల పక్షపాతిగా నిలబడ్డారని అన్నారు. అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభం కావడంతో వైసీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కె.రామారావు పాల్గొన్నారు.

మరణాలపై వక్రభాష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీను, రాజన్నదొర తదితరులు

విజయనగరం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిందని. గుర్ల మండలంలో డయేరియా తో వరుస మరణాలు సంభవిస్తున్నా... దానికి అధికారులు వక్రభాష్యం చెబుతున్నారని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరలు మండిపడ్డారు. జెడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు జ్వరాలు, డయేరియా వంటి వ్యాధుల బారిన పడి మరణిస్తున్నా ప్రభుత్వం కళ్లు తెరవడం లేదన్నారు. గుర్లలో రోగులకు పాఠశాలలోని బల్లలపై చికిత్స అందించడం దారుణమన్నారు. పల్లె పండగ పేరు చెప్పి దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. పంచా యతీల బలోపేతానికి, సర్పంచుల హక్కుల కోసం వైఎస్ఆర్ సీపీ పోరాటం చేస్తుందని తెలిపారు.

వేడుకగా అట్ల తద్ది

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అట్లతద్ది పండగను మహిళలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి మహిళలు ఉపవాస దీక్ష చేశారు. సాయంత్రం గౌరీపరమేశ్వరులకు పూజలు చేశారు. అనంతరం చంద్రుడిని దర్శించి... ఈ పండుగకు ప్రతీకగా తయారు చేసే అట్లు ప్రసాదంగా స్వీకరించారు. మహిళలు వాయనాలు ఇచ్చుకున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బాడంగి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. శనివారం కోడూరు బీటీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను, డొంకలను యంత్రాలతో తొలగించారు. ఈ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో మలుపుల వద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహన చోదకుల భద్రత దృష్ట్యా వాటిని తొలగించినట్టు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు. ఎరుకుల పాకలు గ్రామం మలుపు వద్ద తుప్పలను ఎంపీటీసీ పాలవలస గౌరు, సర్పంచ్ పార్వతి ఆధ్వర్యంలో తొలగించారు.

న్యాయవాదుల కుటుంబాలకు సాయం

కొత్తవలస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్న న్యాయవాదుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ముందుకు వచ్చిందని కొత్తవలస న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులలో ఉన్న న్యాయవాదులతో పాటు మరణించిన వారి కుటుంబాలకు సాయానికి సంబంధించి పెండింగ్‌లోనున్న దరఖాస్తులను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. దీనికి గాను రూ. 6కోట్ల10 లక్షల 36 వేలు మంజూరు చేసిందన్నారు. మృతి చెందిన 88 మంది న్యాయవాదులకు రూ.4 లక్షల చొప్పున, మరో 47 కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందించనున్నట్టు తెలిపారు. అనారోగ్యం కారణంగా ఆర్థిక సాయం కోరుతూ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకున్న 24 మంది న్యాయవాదులకు రూ.11 లక్షల50 వేలు, పదవీ విరమణ చేసిన ఆరుగురు న్యాయవాదులకు రూ.11 లక్షల 86 వేలు అందించనున్నట్టు తెలిపారు. ఈ సాయానికి మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బార్ కౌన్సిల్ కోరిందని దేవి తెలిపారు.

సమస్యలను నిర్భయంగా తెలియజేయండి

● విద్యార్థులకు న్యాయాధికారుల సూచన ● వసతి గృహాల తనిఖీ



బొబ్బిలి గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి అరుణశ్రీ



ఎస్.కోట: విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి సబ్బవరపు వాణి

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో సమస్యలు ఎదురైతే నిర్భయంగా తమకు తెలియజేయాలని స్థానిక సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్.అరుణశ్రీ విద్యార్థులకు సూచించారు. బొబ్బిలి పట్టణం, మండలంలో గల పాఠశాలలను, హాస్టళ్లను శనివారం ఆమె పరిశీలించారు. మెట్టవలసలో ఆసియన్ ఎయిడ్ అంధుల పాఠశాల, బొబ్బిలి సింహాలతోటలో గల ప్రభుత్వ గురుకుల పాఠశాల, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గదులు, భోజనం నాణ్యత, నిర్వహణ, తదితర అంశాలన్నిటినీ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే నిర్భయంగా తెలియజేయవచ్చని అన్నారు. విద్యా సంస్థలను నిర్వహిస్తున్న వారిని వివిధ అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ రఘునాథ్, వార్డెన్ శారద తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించండి

శృంగవరపుకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎస్.కోట జూనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయ సేవా కమిటీ ఛైర్మన్ సబ్బవరపు వాణి అన్నారు. శనివారం స్థానిక వసతి గృహాలను పరిశీలించారు. చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యతోనే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఉత్సాహంగా క్రికెట్ ఎంపిక పోటీలు

విజయనగరం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విజ్జీ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్- 14, 17 బాల బాలికల క్రికెట్, త్రో బాల్, హాకీ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ కు 130 మంది బాలురు, 20 మంది బాలికలు హాజరయ్యారు. హాకీ పోటీలకు 80 మంది బాలురు, 20 మంది బాలికలు, త్రో బాల్ ఎంపికలకు 120 మంది బాలురు, 90 మంది బాలికలు హాజరయ్యారని కార్యదర్శి తెలిపారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగించొద్దు

శృంగవరపుకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకంతో జీవితాలు నాశనమవుతాయని పట్టణ సీఐ జీఎన్ మూర్తి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకంతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. చట్టాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాల వాడకంతో వచ్చు ఆరోగ్య సమస్యలను తెలిపారు. ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయించారు.

న్యూస్ బాక్స్

మద్యం షాపు వద్దని వినతి

బొబ్బిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని బజారు రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ మహిళలు శనివారం మూడోరోజు కూడా ఆందోళనను కొనసాగించారు. షాపు ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం రాత్రికి స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనను కలిసి.. వినతిపత్రం సమర్పించారు

బెల్టుషాపులపై ఫిర్యాదు

రేగిడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండలంలో లైసెన్స్ పొందిన మద్యం దుకాణదారులుసిండికేటై బెల్ట్‌షాపుల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు శనివారం తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి..బెల్ట్‌షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

నేటితో డ్వాక్రా బజారులో అమ్మకాలు ముగింపు

విజయనగరం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను ఆదివారంతో మూసివేస్తామని పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి తెలిపారు. శనివారం వరకు రూ. 6.03 కోట్ల విక్రయాలు జరిగాయని వెల్లడించారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ డ్వాక్రా బజారును సందర్శించారు.

నేడు టీడీపీ సమావేశం

లక్కవరపుకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గానికి సంబంధించిన 5 మండలాల తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల శిక్షణా సమావేశం ఆదివారం ఎల్.కోటలోని తమ స్వగృహం వద్ద జరగనున్నట్టు ఎమ్మెల్యే లలితకుమారి తెలిపారు. ఈ నెల 26 నుంచి మొదలయ్యే పార్టీ సభ్యత్వ నమోదుపై శిక్షణ ఉంటుందన్నారు.

వ్యర్థాల వినియోగంపై అవగాహన

రాజాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజాం పురపాలక సంఘ పరిధిలోని వివిధ అపార్ట్‌మెంట్‌లలో హోమ్ కంపోస్టింగ్ విధానంపై కమిషనర్ జె.రామప్పలనాయుడు శనివారం అవగాహన కల్పించారు. పండ్ల దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలతో ద్రావణాన్ని తయారు చేయు విధానాన్ని మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ ప్రారంభించారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించే ప్రక్రియను పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, ఏఈ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

కుట్టు శిక్షణ ప్రారంభం

బొబ్బిలిరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తారకరామా కాలనీలో అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని శనివారం కంటి వైద్యనిపుణులు కోటగిరి వెంకటఅప్పారావు, సుబంధ ఫౌండేషన్ ఛైర్మన్ కానుగంటి రామకృష్ణలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రత ముఖ్యం

రామభద్రపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉంటే ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అపర్ణ సూచించారు. శనివారం నాయుడువలస పాఠశాల ప్రధానోపాధ్యాయుల జేసీరాజు ఆధ్వర్యంలో ఆమె విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. అ ఈ కార్యక్రమంలో హెచ్‌వో యోగిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ షాపుపై కేసు

జామి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జాగరం రేషన్ దుకాణం డీలర్ పీడిది పైడిరాజుపై 6ఏ కేసు నమోదు చేశామని మండల పౌర సరఫరాల తహసీల్దారు ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలే కరులతో మాట్లాడుతూ శనివారం ఇక్కడ చేసిన తనిఖీలలో 2,462 కేజీల బియ్యం, పంచదార నిల్వల్లో తేడాలు కనిపించాయన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కిచెన్ గార్డెన్ల పరిశీలన

జామి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పీతలపాలెం, నెయ్యిల వీధి అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లను పెంచుతున్న కార్యకర్తలను ఎంఈవో గంగరాజు అభినందించారు. శనివారం గ్రామాల్లో పాఠశాలలతో పాటు అంగన్వాడీలను చూశారు. ప్రభుత్వం నిర్దేశిస్తున్న విధానాలు పాటిస్తున్న వీరి తీరు బాగుందన్నారు.

విచారణకు డిమాండ్

విజయనగరం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ మండలంలోని ఆర్థర్ స్వచ్ఛంద సంస్థలో అవకతవకలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ చేపట్టాలని సిటిజన్ ఫోర్స్ ఛైర్మన్, ఎండీ పి.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రైవేటు హోటల్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

స్కూల్ బస్సు, ఆటో ఢీ

● నలుగురికి గాయాలు

కొమరాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో అంతర్ రాష్ట్ర రహదారిపై విక్రాంపురం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ప్రైవేటు స్కూల్ బస్సు, విద్యార్థులతో వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులతో పాటు ఆటో డ్రైవర్‌కి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి స్థానికుల సహాయంతో తరలించారు. జట్టు ఆశ్రమ విద్యార్థులు విక్రాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల విడిచిపెట్టిన అనంతరం విద్యార్థినులను ఆశ్రమానికి తీసుకువెళుతున్న ఆటో ప్రమాదానికి గురయ్యింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ హేమంత్‌తో పాటు ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పదో తరగతి చదువుతున్న దీవెన, తొమ్మిదో తరగతి చదువుతున్న సింధు, గీతాంజలికి తీవ్ర గాయాలైనట్లు చెబుతున్నారు. దీనిపై కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

311 గ్రామాల్లో సభలు

● జిల్లా సర్వే అధికారి లక్ష్మణరావు

గరుగుబిల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 311 గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సర్వే అధికారి లక్ష్మణరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. గతంలో రీసర్వే నిర్వహించిన రెవెన్యూ గ్రామాల్లో భూముల సరిహద్దుల వద్ద రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం రీసర్వే నిర్వహించిన ప్రాంతాల్లో కొన్ని సమస్యలు గుర్తించామని తెలిపారు. వాటి పరిష్కారానికి గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు మండలాల వారీగా నిర్దేశించిన సమయంలో గ్రామసభలు పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. గరుగుబిల్లికి సంబంధించి ఈ నెల 28 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ పి.గాంధీ, ఆర్ఐ శ్రీనివాసరావు, ఎంపీపీ రామారావు, వీఆర్వో రాఘవేంద్రరావు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ అధికారులమంటూ వసూళ్లు

మక్కువ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మక్కువలో జీఎస్టీ అధికారులమని ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి దుకాణాల వద్దకు వెళ్లి శనివారం డబ్బులు వసూలు చేశారు. తీసుకున్న నగదుకు రశీదులు ఇవ్వకపోవడంతో వ్యాపారులు సందేహంతో స్థానిక పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న పోలీసులు సాయిభగవాన్ కల్యాణ మండపంలో కారును ఆపి వివరాలు తెలపమని అడగడంతో పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దీంతో వ్యాపారులు కారును అడ్డగించి కొంతసేపు ఆందోళన చేశారు. వారు నిజమైన అధికారులా, నకిలీ అధికారులా.. అని గుర్తిస్తామని పోలీసులు వ్యాపారులను సముదాయించారు. ఇద్దరు వ్యక్తులను విచారణ నిమిత్తం సాలూరు సర్కిల్ కార్యాలయానికి తరలించారు.

కోటదుర్గమ్మ హుండీఆదాయం రూ.13.74 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పాలకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయ హుండీలను శనివారం తెరిచి లెక్కించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు పర్యవేక్షణలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. గత నెల 26 నుంచి అక్టోబరు 19 వరకు హుండీల ద్వారా రూ.13లక్షల 74వేల 102 వచ్చినట్టు ఈవో తెలిపారు. మిక్స్‌డ్ బంగారం 11 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, మిక్స్‌డ్ వెండి 470 గ్రాములు భక్తులు సమర్పించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మతో పాటు రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసశర్మ, జూనియర్ అసిస్టెంట్ లత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిశీలన


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గజాల ఖానా వద్ద గల శ్మశాన వాటికను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం పరిశీలించారు. శ్మశాన వాటిక వద్ద కొన్ని సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులపై టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, ప్రజలు ఆయనకు వివరించారు. వర్షాలు పడితే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. శ్మశానవాటిక సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

కుమ్మరివలసలో జ్వరాలు

పాచిపెంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరివలసలో గత రెండు రోజులుగా పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రవిచంద్ర ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. నలుగురు జ్వర బాధితుల నుంచి రక్తపూతలు తీసి, పరీక్షలు నిర్వహించారు. వైరల్ ఫీవర్లుగా గుర్తించారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జాగ్రత్తలు పాటించాలంటూ అవగాహన కల్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ఆ గ్రామాన్ని సందర్శించారు. జ్వరాలు ప్రబలకుండా చూడాలని కోరారు.

చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపాలి

సాలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తాము చెయ్యి ఎత్తిన చోట బస్సులు ఆపటం లేదని అలా ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎం బాస్కర్‌రెడ్డికి పలువురు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపారు. బొబ్బిలి మీదుగా రాజాం, పాలకొండ, కొత్తూరు, హడ్డుబంగి, పర్లాకిమిడి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. జయ్‌పూర్ నుంచి వస్తున్నప్పుడు రామభద్రపురం వద్ద పార్వతీపురం సూపర్ లగ్జరీ బస్సులు ఆపడం లేదని తెలిపారు. పంచ క్షేత్రాలకు, శివాలయాలకు బస్సులు నడపాలని కోరారు. మామిడిపల్లి పాయింట్ నందు, పోస్టుఆఫీస్ నందు ఫేబ్రిక్ గైడ్స్ పెట్టాలని పలువురు కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

సీతానగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం గుడ్డిపేట గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల ప్రభావంతో పడొద్దని అన్నారు. మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరిపిన వారిపై తగు సమాచారం ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం

పార్వతీపురం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలంలో శనివారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తోంది. గత కొన్ని రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈక్రమంలో వర్షం పడడంతో మండల వాసులు కాస్త ఉపశమనం పొందారు. ● గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఎండిపోతున్న వరి చేలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ● సీతంపేట రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రానికి వాతావరణం చల్లబడి వర్షం పడింది.


బారామణి కూడలిలో బస్ షెల్టర్ లేక చెట్ల కిందే..

బస్ షెల్టర్ నిర్మించరూ..

● బారామణి జంక్షన్‌లో ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
● దశాబ్దాలుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోని అధికారులు

కురుపాం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కురుపాం మండలంలోని బారామణి జంక్షన్‌లో బస్ షెల్టర్ నిర్మించాలని అక్కడి గిరిజనులు దశాబ్ద కాలంగా విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదు. దీంతో పలు గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. బారామణి కూడలిలో బస్ షెల్టర్ నిర్మిస్తే పొడివలస, బల్లేరు, జి.శివడ గ్రామాలకు వెళ్లే గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం గిరిజనులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ చెట్ల కింద వాహనాల కోసం నిరీక్షిస్తున్నారు. తక్షణం బారామణి కూడలిలో బస్ షెల్టర్ నిర్మించాలంటూ గిరిజనులు కోరుతున్నారు.

పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

● మంత్రి సంధ్యారాణి


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ప్రతిఒక్క కార్యకర్త దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో శనివారం టీడీపీ కార్యకర్తలతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 26 నుంచి వచ్చే నెల 26 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని రెండు లక్షల మందికిగాను 50వేల మందికి పైగా పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని ఆమె కోరారు. కొండల ప్రాంతాల్లో ఉన్నవారికి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ జరగకపోతే ఆఫ్‌లైన్‌లో నిర్వహించే వెసులుబాటు ఉందన్నారు. దీపావళి పండుగ నాటికి దీపం పథకం ద్వారా మూడు గ్యాస్ సిలెండర్లు మంజూరు చేస్తారని తెలిపారు. మక్కువ మండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. రహదారుల గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం రూ.300కోట్ల నిధులు మంజురు చేసిందన్నారు. నీటి సంఘం ఎన్నికలు త్వరలో పూర్తిగా రాజ్యాంగబద్ధంగా నిర్వహిస్తామన్నారు.

రాజన్నదొర గిరిజన మంత్రి అని మాట్లాడడం హాస్యాస్పదం

రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహిస్తుంటే.. మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర తాను రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రిగా ఉన్నట్లు మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని సంధ్యారాణి ఎద్దేవా చేశారు. కోట్ల కుంభకోణం చేసిన గిరిజన సంక్షేమశాఖ ఈఈని సస్పెండ్ చేస్తే అదేదో తప్పులా మాట్లాడుతున్నారంటే అందులో మాజీ మంత్రి పాత్ర ఉందా.. అని ఆమె ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు శ్యామలాంబ పండుగ గుర్తుకు రాలేదని, ఇప్పుడు తాము చేయాలని సంకల్పిస్తే లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

పల్లె పండుగకు హాజరు కావాలి

పల్లె పండుగ కార్యక్రమం ఈనెల 28న మెంటాడలో, 29న సాలూరు మండలంలో, 30న మక్కువలో, 31న పాచిపెంటలో నిర్వహిస్తామని, అంతా హాజరు కావాలని ఆమె కోరారు. మున్సిపాల్టీకి త్వరలో కొత్త కమిషనర్ వస్తారని, ప్రస్తుతం ఉన్న కమిషనర్ బదిలీపై వెళ్లిపోతారని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేశ్వరరావు, పిన్నింటి ప్రసాద్‌బాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటారు

రాష్ట్ర స్థాయి పోటీలకు బొడ్డవలస విద్యార్థులు

సాలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం ఎనిమిది మంది స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్ శనివారం స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు శనివారం విజయనగరం జిల్లా కేంద్రంలో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో బొడ్డవలస గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.రంజిత్ ట్రిపుల్ జంప్‌లో, చరణ్‌తేజ షాట్‌పుట్‌లో, నూతన్ కుమార్ జావలిన్‌త్రోలో స్వర్ణ పతకాలను సాధించారు. అథ్లెటిక్ 1500 మీటర్ల పరుగు పందెంలో పి.హర్ష, 400 మీటర్ల పరుగుపందెంలో ఆర్.రాహుల్‌చంద్, డిస్కస్ త్రోలో కె.చరణ్‌తేజ, షాట్‌పుట్‌లో ఆర్.అశ్వంత్ రజత పతకాలు సాధించారు. డిస్కస్‌త్రోలో పి.హర్ష కాంస్య పతకం సాధించగా, బాల్‌బాడ్మింటన్‌లో ప్రవీణ్, సంతోష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 24 నుంచి 26 వరకు కర్నూల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉమ్మడి జిల్లా బీఆర్ అంబేడ్కర్ గురుకులాల కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

పార్వతీపురంటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు పట్టణంలోని సంస్కృత ఉన్నత పాఠశాల విద్యార్థి వి.ధనుంజయరాజు సత్తా చాటాడు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం జి.హేమసుందరరావునాయుడు శనివారం తెలియజేశారు. ఇటీవల మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ధనుంజయరాజు ఉత్తమ ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. ఈనెల 29, 30వ తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మన్యం జిల్లా తరపున పాల్గొంటాడని తెలిపారు. ధనుంజయరాజుకు తర్ఫీదు ఇచ్చిన భౌతిక శాస్త్ర పండితుడు యు.గోవిందరావుతో పాటు సంస్కృత ఉపాధ్యాయుడు జేబీ తిరుమలాచార్యులను హెచ్‌ఎం అభినందనలు తెలిపారు.

● కురుపాం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పార్వతీపురంలోని ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన చెస్ పోటీల్లో అండర్-14 విభాగంలో దాదుపురానికి చెందిన పసుపురెడ్డి నవీన్, అండర్-17 విభాగంలో స్టేషన్ బుడ్డివలసకు చెందిన గేదెల శ్రీకాంత్ ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పి.సత్యనారయణ, పీఈటీ యు.సత్యం, ఎస్ఎంసీ చైర్మన్ డి.మణిపూర్ణ, ఉపాధ్యాయులు వీరికి అభినందించారు.

హాకీ పోటీల్లో కొత్తగూడ విద్యార్థుల ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ హాకీ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల పీడీ మాధవరావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియంలో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ హాకీ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన ఎ.నవీన్‌కుమార్, మీనక చింటూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో ఆరిక శివ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వీరు వచ్చే నెల 9 నుంచి పదో తేదీ వరకు అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఎంపికైన విద్యార్థులకు మండలశాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

సెంచూరియన్ విద్యార్థులకు 'అదితం' ఉపకార వేతనాలు


సెంచూరియన్ ఉపాధ్యక్షుడు డీఎన్ రావుతో ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు

నెల్లిమర్ల, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు చేతులమీదుగా వీటిని శనివారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది అదితం ట్రస్టు తరపున ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న దున్న తేజ, ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థిని కంది లావణ్యల కు చెరో రూ.1.50లక్షల ఉపకార వేతనంగా అందజేశారు. చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ డా.పల్లవి, ప్రొఫెసర్ శాంతమ్మ, ఐక్యూ ఏసీ హెచ్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్‌లు డా.సన్నిద యాల్, డా.విజయ్ బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్ఎస్ వర్మ, బీబీఏ విభాగం అధిపతి డా.మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

పార్వతీపురంటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం స్థానిక పోలీసులు నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. ఈనెల 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వీరఘట్టం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని యు.వెంకమ్మ పేట పరిధిలో ఉన్న రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్‌లో శనివారం వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కరణం చిన్నమనాయుడు, ఉపాధ్యక్షుడిగా చందక సత్తిబాబు, కార్యదర్శిగా కోట శంకరరావు, ఉప కార్యదర్శిగా ఖండాపు హరి, కోశాధికారిగా కొరికాన అసిరినాయుడులను ఎంపిక చేశారు. అనంతరం కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఎం.రాజపురంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కెల్ల రాము, ఎఫ్‌పీవోసీసీ ఆనంద్, ఎఫ్‌పీవో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారు చేయాలి

వీరఘట్టం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్వరలో జరగబోయే నీటి సంఘం ఎన్నికలకు తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలని తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ వీఆర్వోలకు ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సంఘం ఎన్నికలు త్వరలో జరుగుతున్నందున ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. గ్రామాల్లో భూముల రీసర్వేలో ఏమైనా పొరపాట్లు ఉన్నా రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ నాయుడు, వీఆర్వోలు,సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల వలలో పడకుండా చూడండి

ఒడిశా

రాయగడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన పత్తి మొత్తం ప్రభుత్వం ఖరీదు చేసేలా చర్యలు తీసుకోవాలని, రైతులు దళారుల వలలో పడకుండా చూడాలని కలెక్టర్ పారుల్ పట్వారి అన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాలులో శనివారం ఆమె అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 49 వేల 8వందల హెక్టార్లలో 7లక్షల 23 వేల 242 క్వింటాళ్ల పత్తి పండుతుందని అంచనా వేశారు. ఈ సంవత్సరం పత్తి ధర క్వింటాలకు రూ.7521గా నిర్ణయించినట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో స్థానిక శాసన సభ్యుడు అప్పలస్వామి కద్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హిక్కాక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి బిష్ణుప్రసాద్ కర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రాయగడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అంబోదల పోలీసులు పేకట స్థావరంపై దాడిచేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు అంబోదలలో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.లక్షా 37వేల 130 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

న్యూస్ బాక్స్

రేపటి పీజీఆర్ఎస్‌కు కలెక్టర్ గైర్హాజరు

సీతంపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ గైర్హాజరు కానున్నారు. ముందుగా హాజరవుతారని ప్రకటించినప్పటికీ ఆ రోజున పోలీస్ అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొననున్న నేపథ్యంలో హాజరు కావడం లేదని పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వారం కూడా ఐటీడీఏ పీవోతో పాటు ఉన్నతాధికారులు గ్రీవెన్స్‌కు అందుబాటులో ఉంటారని చెప్పారు.

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి

గరుగుబిల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లైసెన్స్ తీసుకునే వ్యాపారులు ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి బాణసంచాను విక్రయించాల్సి ఉందన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పట్టణ ప్లానింగ్ అధికారిగా ఝాన్సీ

సాలూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్లానింగ్ అధికారిగా కె.ఝాన్సీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ పట్నంలో వీకేపీసీపీఐఆర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో టీపీవోగా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆమె మున్సిపల్ కమిషనర్ సత్యనారయణను మర్యాద పూర్వకంగా కలుసుకుని మున్సిపల్ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు పదోన్నతి

పార్వతీపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం గిరిజన ఇంజనీరింగ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కుమార్‌కు సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించింది. త్వరలోనే విశాఖపట్నంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. సాలూరు గిరిజన ఇంజనీరింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మణి రాజుకు పార్వతీపురం గిరిజన ఇంజనీరింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించింది. దీనికి సంబంధించి పార్వతీపురం ఐటీడీఏకు ఆదేశాలు రానున్నాయి.

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు తప్పవు

భామిని, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు తప్పవని తహశీల్దార్ ఎస్.అప్పారావు స్పష్టం చేశారు. శనివారం సాయం త్రం తమ కార్యాలయం సమీపంలో సిబ్బందితో ఇసుక లారీలను తనిఖీ చేశారు. వాహనాలకు అర్హత ధ్రువప త్రాలు తనిఖీ చేసి విడిచిపెట్టారు. ఆయనతో సర్వేయర్ రాజేష్, విఆర్వో జి.వెంకటరమణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎంఎస్ ఎన్నిక ఏకగ్రీవం

భామిని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భామిని మండల మహిళా సమాఖ్య ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందని ఏపీఎం ఎం.చక్రపాణి తెలిపారు. శనివారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో మండలానికి చెందిన 33 గ్రామైఖ్య సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు. బిడ్డిక షైమావతి అధ్యక్షురాలుగా, చప్పల శశి, టి.పార్వతి, భూపతి, భవానీ, పి.విజయలక్ష్మీలు ఉపాధ్యక్షురాలు, కార్యదర్శులుగా ఎంపికయ్యారు.

బాలయ్యను కలిసిన కురుపాం ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య బాబును శనివారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.